తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
జనరల్
NEWS

SPECIAL EDITION

# ప్రజాపాలనకు సిద్ధం



**తెలంగాణ వీణ, హైదరాబాద్ :** ప్రజా పాలనకు గ్రేటర్ సిద్ధమైంది. గురువారం నుంచి జనవరి 6 వరకు (డిసెంబర్ 31, జనవరి 1 మినహా) గ్రేటర్‌లో 150 వార్డులలో 600 సెంటర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నారు. ప్రతి వార్డులో నాలుగు ముఖ్య ప్రాంతాలను ఎంపిక చేసి నాలుగు టీంలను ఏర్పాటు చేశారు. టీం లీడర్‌తో కలిసి మొత్తం 8 మంది ఉంటారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు షిఫ్టుల వారీగా దరఖాస్తులను స్వీకరించనున్నారు. మొత్తం 4800 మంది ప్రజాపాలన విధుల్లో పాల్గొంటుండగా.. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. స్వయం సహాయక బృందాలతో దరఖాస్తు ఫారాలను అందజేసి, దరఖాస్తులు సమర్పించిన అనంతరం దరఖాస్తుదారుడికి రసీదును ఇవ్వనున్నారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు నోడల్ ఆఫీసర్లుగా సీనియర్ ఐఏఎస్ అధికారులు ఈ. శ్రీధర్, కె. నిర్మలను నియమించారు. ప్రజా పాలన మొదటి రోజు కార్యక్రమాన్ని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బంజారాహిల్స్ డివిజన్‌లో ప్రారంభించనున్నారు.

# 'ప్రజా పాలన'కు విశేష స్పందన.. పలుచోట్ల ప్రజల నిరసనలు



**తెలంగాణ వీణ, హైదరాబాద్ :** ఆరు గ్యారంటీల అమలే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఇవాళ్టి నుంచి జనవరి 6 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుండగా.. గ్రామ, వార్డు సభల్లో అర్జీలు సమర్పించేందుకు ఉదయం నుంచే ప్రజలు బారులు తీరారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలతో పాటు రేషన్ కార్డులు, ఇతర అవసరాల కోసం కూడా వినతిపత్రాలు, ఫిర్యాదులు అందజేస్తున్నారు. మరోవైపు, అభయహస్తం దరఖాస్తు ఫామ్‌లు అందడం లేదని పలు చోట్ల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొందరు దళారులు జిరాక్స్ సెంటర్ల వద్ద రూ.50 నుంచి రూ.100 విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. హైదరాబాద్ శేరిలింగంపల్లిలోని చందానగర్ ఈసేవా కేంద్రం వద్ద స్థానికుల ఆందోళనకు దిగారు. ఉదయం నుంచి లైన్‌లో వేచిచూస్తున్నా.. అభయహస్తం దరఖాస్తు ఫామ్‌లు ఇవ్వడం లేదన్నారు. కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్ వార్డు కార్యాలయంలో సైతం దరఖాస్తు ఫామ్‌లు ఇవ్వడం లేదని స్థానికులు నిరసనకు దిగారు.

# స్టవ్ పక్కన నిద్రపోయి.. ప్రాణాలు కోల్పోయిన బౌన్సర్!

**తెలంగాణ వీణ, జాతీయం :** చలికి తట్టుకోలేని ఓ వ్యక్తి ఇంట్లో బొగ్గుల కుంపటి పక్కనే నిద్రపోయి.. మంటల కారణంగా మృతి చెందాడు. ఈ విషాద ఘటన దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న ఫతేపూర్ బెరీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ మృతిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఢిల్లీని చలి వణికిస్తోన్నా విషయం తెలిసిందే.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... అంగన్‌వారీ వలీ ప్రాంతంలో నివాసముంటున్న వైనీ అరోరా (36) బౌనర్స్‌గా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం తీవ్రంగా చలివేయడంతో.. గ్రౌండ్ ఫ్లోర్‌లోని తన గదిలో ఉన్న చిన్న బొగ్గుల స్టవ్‌లో నిప్పు ఏర్పాటు చేసుకున్నాడు. అరోరా చలి కాచుకుంటూ.. అలాగే నేలపై నిద్రపోయాడు. ప్రమాదవశాత్తు బొగ్గులు ఎక్కువగా మండడంతో.. ఆ మంటలు అరోరా దుస్తులకు అంటుకున్నాయి. దాంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు.స్థానికులు సమాచారం అందించగా ఫతేపూర్ బెరీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వైనీ అరోరా గది లోపలి వైపు నుంచి గడియ పెట్టి ఉండడంతో పోలీసులు తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లారు. అరోరా నేలపై పడి కాలిపోయినట్లు ఉన్నాడు. రూంలోని మరికొన్ని వస్తువులు కూడా కాలిపోయాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# జొమాటోకు జీఎస్టీ షాక్.. పడిపోయిన షేర్స్




**తెలంగాణ వీణ, జాతీయం :** ఆన్ లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటోకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (DGGI) డిమాండ్ నోటీసులు పంపించింది. వినియోగదారుల నుంచి వసూలు చేసిన డెలివరీ ఫీజుపై జీఎస్టీకి సంబంధించిన బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేసింది. 400 కోట్ల రూపాయల బకాయి పడినట్లు ఆ నోటీసులో జీఎస్టీ పేర్కొనింది. డెలివరీ అనేది సేవ కాబట్టి 18 శాతం జీఎస్టీ కట్టాలని డీజీజీఐ స్పష్టం చేసింది. దీంతో ఇవాళ ఉదయం జొమాటో షేర్లు 4 శాతానికి పైగా పడిపోయాయి.ఇక, షోకాజ్ నోటీసులపై జొమాటో రియాక్ట్ అయ్యారు. తమవైపు నుంచి ఎలాంటి పన్ను బకాయిలూ లేవని ఈ ఫుడ్ డెలివరి సంస్థ తెలిపింది. డెలివరీ భాగస్వాముల తరఫున తాము డెలివరీ ఛార్జీలు వసూలు చేశామని చెప్పింది. అలాగే కస్టమర్లకు తాము నేరుగా డెలివరీ సేవలు అందించలేం.. కాబట్టి, పరస్పర ఆమోదంతో కుదుర్చుకున్న నియమ నిబంధనల ప్రకారం డెలివరీ భాగస్వాములే ఆ సేవలను అందిస్తున్నారని వివరించింది. అయితే, జొమాటోలో కస్టమర్ ఫుడ్ ఆర్డర్ చేసినప్పుడు బిల్లులో మూడు అంశాలను పొందుపరిచాయి. అందులో ఆహార పదార్థాల ధర ఒకటి కాగా, మరొకటి ఫుడ్ డెలివరీ ఛార్జీ.. సబ్ స్క్రిప్షన్ తీసుకున్నవారికి దీని నుంచి మినహాయింపు ఉండనుంది. మూడోది ఆహారం ధర, ప్లాట్ ఫామ్ ఫీజుపై ఐదు శాతం పన్ను గురించి తెలియజేస్తుంది. ఈ ట్యాక్స్ ను జీఎస్టీ మండలి 2022 జనవరి నుంచి అమలులోకి తీసుకు వచ్చింది. అలాగే, జొమాటోకు రూ. 400 కోట్లు కట్టాలని తెలపగా.. స్విగ్గీకి రూ. 350 కోట్ల బకాయిలు చెల్లించాలని జీఎస్టీ తెలిపింది. అయితే, 'డెలివరీ ఛార్జ్' అనేది ఇంటింటికీ ఆహారాన్ని డెలివరీ చేయడానికి వెళ్ళే డెలివరీ భాగస్వాములు భరించే ఖర్చు తప్ప మరొకటి కాదు అని స్విగ్గీ, జొమాటో తెలిపాయి. జీఎస్టీ బకాయిలతో ఫుడ్ ఆర్డర్‌ల ఛార్జీలను 2 నుంచి 3 రూపాయలకి స్విగ్గీ, జొమాటో ఆన్ లైన్ ఫుడ్ డెలివరి సంస్థలు పెంచాయి.

# విజయకాంత్ మృతి పట్ల ప్రధాని మోడీ సంతాపం

తెలంగాణ వీణ, జాతీయం : తమిళ నటుడు డీఎండీకే అధినేత విజయకాంత్ మృతి పట్ల భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం బాధాకరం.. తమిళ చలనచిత్ర పరిశ్రమలో ఆయన ఒక లెజెండ్ అని పేర్కొన్నారు. తన నటనతో కోట్ల మంది అభిమానులను విజయకాంత్ సొంతం చేసుకున్నారు.. రాజకీయ నాయకుడిగా ప్రజా సేవలో నిమగ్నమయ్యారు.. తమిళనాడు రాజకీయాలను విజయకాంత్ ఎంతో ప్రభావితం చేశారని ప్రధాని అన్నారు. డీఎండీకే అధినేత విజయకాంత్ నాకు మంచి మిత్రుడు అని ప్రధాని మోడీ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. ఆయన లేరనే వార్త నన్ను తీవ్రంగా కలిచి వేసిందన్నారు.. విజయకాంత్ కుటుంబానికి, ఆయన అభిమానులకు, అనుచరులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. ఓ శాంతి అని భారత ప్రధాని మోడీ చెప్పుకొచ్చారు.

